

పాతపట్నం నియోజకవర్గ సమస్యలు పరిష్కరించండి : ఎమ్మెల్యే గోవిందరావు

విశాలాంధ్ర - జలుమూరు : పాతపట్నం నియోజకవర్గంలో అధిక శాతం గిరిజనులు దళితులు వెనకబడిన కులాల వారు ఉన్నారని అనేక మారుమూల ప్రాంతాలు కలవని వీటన్నిటిని పరిష్కరించాలని పాతపట్నం శాసనసభ్యులు మామిడి గోవిందరావు శనివారం జిల్లా కలెక్టర స్వప్నల్ నీ కలిసి వినతిపత్రం అందజేశారు. చాలా గ్రామాల్లో కనీస మౌలిక సదుపాయాలు లేవని ఈ నియోజకవర్గ అభివృద్ధికి మీ వంతు సహకారం అందించాలని గోవిందరావు కోరారు. అనంతరం కలెక్టర్ను దుశ్శాలువతో సత్కరించి అభినందించారు.

వైద్య రంగం ప్రైవేటీకరణకు కూటమి ప్రభుత్వం యత్నం : మాజీ మంత్రి డా.సీదిరి అప్పలరాజు

విశాలాంధ్ర - పలాస : రాష్ట్రంలో వైద్య రంగాన్ని ప్రైవేటీకరణ చేసేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తుందని, దీనిలో భాగంగా పులివెందల ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబిబిఎస్ సీట్ల భర్తీకి ఎన్.ఎం.సి ఆమోదం విస్మయం కల్పిస్తుందన్న వైద్య ఆరోగ్య శాఖా మంత్రి మాటలు ఆశ్చర్యకరంగా ఉందని రాష్ట్ర మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. శనివారం ప్రగతి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారం కోసం అడ్డగోలుగా హామీలు ఇచ్చిన తరువాత ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇచ్చిన హామీలను తుంగలోకి తోక్కారని విమర్శించారు. రాష్ట్రంలో నూతన వైద్య కళాశాల విషయంలో టీడీపీ ప్రభుత్వ నిర్ణయం నిట్ విద్యార్థులకు శాపంగా మారిందన్నారు. చంద్రబాబు ఇచ్చిన హామీలకు తాను గ్యారెంటీ అన్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పందించాలన్నారు. రాష్ట్రంలో వైద్యవిద్యను పేద విద్యార్థులకు చేరువ చేసేందుకు గత ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి ఒకేసారి 17 వైద్య కళాశాలల నిర్మాణం చేపట్టారని గుర్తు చేశారు. వాటిలో భాగంగా గత విద్యా సంవత్సరంలో 5 వైద్య కళాశాలలు నిర్మాణం పూర్తి చేసుకొని జాతీయ వైద్య కమిషన్ అనుమతులు కూడా పొందాయని అన్నారు. 2023-24 విద్యా సంవత్సరంలో విజయనగరం, మచిలీపట్నం, రాజమండ్రి, ఎలూరు, నంద్యాల కళాశాలలు ప్రారంభమై ఒకేసారి 750 మెడికల్ సీట్లు అందుబాటులోకి వచ్చాయన్నారు. కూటమి ప్రభుత్వం నిర్వాహకంతో ఈ ఏడాది 700 ఎంబిబిఎస్ సీట్లు రాకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కొత్తగా వైద్య కళాశాలలు ప్రారంభమైతే నీట్ విద్యార్థులకు మేలు జరిగితే ఎక్కడ జగన్‌కు పేరు వస్తుందన్న అత్యంత హేయమైన దుర్బుది చంద్రబాబుది అన్నారు. ఇప్పటికే ప్రారంభమైన 5 కొత్త వైద్య కళాశాలలను ప్రైవేటీపరం చేయడం ద్వారా విద్యార్థులకు వెన్నుపోటు పోడుస్తున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కుతంత్రం వలన ఈ ఏడాది ప్రారంభం కావాల్సిన 5 వైద్య కళాశాలల ద్వారా 750 ఎంబిబిఎస్ సీట్లు వచ్చే విద్యాసంవత్సరం 2025-26లో ప్రారంభించాల్సిన మరో 7 వైద్య కళాశాలలు పనులు నిలిపి వేయడం ద్వారా మరో 1050 ఎంబిబిఎస్ సీట్లు రాష్ట్ర విద్యార్థులు కోల్పోతున్నారని అన్నారు. అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కొత్త వైద్య కళాశాలల విషయంలో యూ టర్న తీసుకున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వ తీరుపై ఆయన మండి పడ్డారు.

నేడు పలాసపురంలో క్విజ్ పోటీలు

విశాలాంధ్ర - సోంపేట : ఈ మండలం పలాసపురం గ్రామంలో వరసిద్ధి వినాయక యూత్ ఆద్వర్యంలో జిల్లాస్థాయి క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 10వ తరగతి వరకు అందరి విద్యార్థులు అర్హులు, జట్టుకు నలుగురు మాత్రమే ఉండాలి. ఒక స్కూల్ నుంచి ఎన్ని జట్లయినా పాల్గొనవచ్చు. ఎటువంటి ప్రవేశ రుసుం లేదు. పూర్తి వివరాలకు 7287920142 నెంబరుకు సంప్రదించాలని కోరారు.

నాటుసారా పూర్తిగా నియంత్రించాలి

విశాలాంధ్ర - సోంపేట : ఆంధ్రాలో ఒడిశాకు సరిహద్దు గ్రామాలు నాటుసారా విక్రయాలకు నిలయంగా మారాయని మానవ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.వి.జగన్నాధరావు, జిల్లా కార్యదర్శి బీన ఢిల్లీరావు పేర్కొన్నారు. ఈ మేరకు కమిటీ సభ్యులతో కలిసి ఈ మండలం శారదాపురం గ్రామంలో శనివారం పర్యటించారు. గ్రామంలో పలువురు వ్యక్తులు నాటుసారాకు బానిసలై మరణించారని పేర్కొన్నారు. అటువంటి కుటుంబాల పరిస్థితి చాలా ఇబ్బందికరంగా మారిందని అన్నారు. ప్రభుత్వం ఇటువంటి చావులు నియంత్రించేందుకు కట్టుదిట్టంగా వ్యవహరించాలని కోరాయి. ఈ నెల 23న బాధిత కుటుంబాలతో కలిసి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్.వెంకటరావు, చౌదరి లక్ష్మణరావు తదితరులు ఉన్నారు.

అన్నదానం మహాదానం

ఎస్ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ సూర శ్రీనివాసరావు

విశాలాంధ్ర - ఎచ్చెర్ల : దానాలు అన్నిట్లోనూ అన్నదానం మహాదానంతో సమానం అని ఎస్ ఎస్ ఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ సూర శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని సంతోషిమాత కోవెల వద్ద, ఫాజుల్ బాగ్ పేట, హయాతినగరం, అల్లినగరం తదితర ప్రాంతాల్లో నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటుచేసిన వినాయక విగ్రహం వద్ద శనివారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో సూర శ్రీనివాసరావు పాల్గొన్నారు. జిమ్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక భావనతో మానసిక శక్తి సిద్ధించడంతో పాటు సేవా దృక్పథం అలబడుతుందన్నారు. వినాయక చవితి నవరాత్రులు ప్రతి ఒక్కరూ భక్తులతో జరుపుకుంటూ లోక రక్షణ కోసం పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు. ఆ గణనాథుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలు ఆయురారోగ్యాలతో కలకాలం వర్ధిల్లాలని కోరుకున్నారు. గ్రామాల్లోని యువత కలిసికట్టుగా ఉంటూ నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని సూచించారు. అన్నం పరబ్రహ్మ స్వరూపమని, అన్నదానం చేయడం ద్వారా ఆకలి తీర్చుకున్న భక్తులు ఎంతో సంతృప్తి చెందుతారని తెలిపారు. అందుకే గత కొన్నేళ్లుగా ఎచ్చెర్ల, శ్రీకాకుళం నగరంలోని అనేక ప్రాంతాల్లో అన్నదాన కార్యక్రమాలను నిర్వహించడం తనకు ఆనవాయితీగా వస్తుందని చెప్పారు. హిందూ ధర్మంలో ఆకలితో ఉన్న జీవికి ఆహారం ఇవ్వడం కంటే మంచి పూజ లేదని భావిస్తారని చెప్పారు. ఈ అన్నదాన కార్యక్రమంలో సుమారు 10,000 మంది గ్రామస్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

ప్రజలకు కష్టాలు లేకుండా చేయడమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

విశాలాంధ్ర - టెక్కలి : ప్రజలకు కష్టాలు లేకుండా చూసుకోవడమే కూటమి ప్రభుత్వ ధ్యేయం అని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఈ సందర్భంగా శనివారం ఆయన టెక్కలిలో పర్యటించి స్థానిక జిల్లా ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై వైద్యశాఖ అధికారులకు వివరాలు ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం, మంత్రి ఆస్పత్రి అంతా పరిశీలిస్తూ లిఫ్ట్ పనిచేయకపోవడం కారణాలు ఏమిటని వైద్య సిబ్బందికి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోగులు పడుతున్న ఇబ్బందులను చూసి అసహనం వ్యక్తం చేశారు. నేను ఆసుపత్రిని ఎన్నిసార్లు తనిఖీలు నిర్వహించిన ఇక్కడ సమస్యలు మాత్రం రోజురోజుకీ తలెత్తుతూనే ఉన్నాయని వైద్య సిబ్బందిపై మండిపడ్డారు. తక్షణమే లిఫ్ట్ మరమ్మత్తులు చేపట్టాలని, రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని, ఆహారం, త్రాగునీరు, శానిటేషన్ అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని వైద్య అధికారులను ఆదేశించారు. రోగులకు నిత్యం వైద్యులు అందుబాటులో ఉండాలని, సమయపాలన పాటిస్తూ, ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని సూచించారు. ఆస్పత్రి వెనుక భాగంలో ఉన్న ఖాళీ స్థలంలో మరణించిన వ్యక్తి పోస్టుమార్టం కోసం మార్చురీ, బయో వేస్టేజ్ కేంద్రం ఏర్పాటు చేసేందుకు అధికారులతో కలిసి మంత్రి స్థలాన్ని పరిశీలించారు. ఆస్పత్రి ఆవరణంలో పచ్చని మొక్కలు పెంచాలని, రోగులు ఆహ్లాదకర వాతావరణంలో ఉండేలా మార్చాలని తెలిపారు. ఆసుపత్రిలోకి గోవులు చొరబడకుండా చూసుకోవాలని, రహదారుల పై తిరిగే గోవులకు గోశాల నిర్మించేందుకు వంశిధార కాలనీలో స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, వైద్య సిబ్బంది, పోలీస్ సిబ్బంది, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

48 కేసులు రాజీ

విశాలాంధ్ర - సోంపేట : సోంపేట కోర్టుల ప్రాంగణంలో జరిగిన లోక్‌అదాలత్ కార్యక్రమంలో 48 కేసులు రాజీ చేశారు. సీనియర్ సివిల్ జడ్జి జె.శ్రీనివాసరావు, జూనియర్ సివిల్ జడ్జి పి.పరేష్‌కుమార్ ఆధ్వర్యంలో రెండు బెంచీలను ఏర్పాటు చేసి కేసులను పరిష్కారం చేశారు. ఐపిసి కేసులు 24, సివిల్ దావాలు 11, ఒక చెక్ బౌన్స్ కేసు, 11 ప్రీ లిటిగేషన్ కేసులు, ఒక మెంటినెన్స్ కేసుతో పాటు మొత్తం 48 కేసులు రాజీ అయ్యాయి. ఈ రెండు బెంచీలకు అడ్వకేట్ రుగ్మంధుదు, కెవివి. ప్రసాద్ సహకరించారు.

రహదారి ప్రమాదంలో యువకులకు గాయాలు

విశాలాంధ్ర - టెక్కలి : మండలం చలమయ్యపేట గ్రామ సమీప జాతీయ రహదారిపై శనివారం ప్రమాదం చోటు చేసుకుంది. పలాస కు చెందిన ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై రాంగ్ రూట్లో వెళుతుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడకక్కడే పడి తీవ్ర గాయాలు పాలయ్యారు. ఈ విషయం తెలుసుకున్న 1033 నేషనల్ హైవే అంబులెన్స్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన యువకులను చికిత్స నిమిత్తం టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు.

జాతీయ లోక్‌అదాలత్‌లో 144 కేసులు పరిష్కారం

విశాలాంధ్ర - టెక్కలి : మండలంలో స్థానిక కోర్ట్ ఆవరణంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో 144 కేసులు పరిష్కారమైనట్లు సీనియర్ సివిల్ జడ్జ్ జై శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ లోక్ అదాలత్ లో సీనియర్ సివిల్ జడ్జి, టెక్కలి జె శ్రీనివాసరావు అధ్యక్షతన ఒక బెంచ్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి సిహెచ్ హరిప్రియ రెండు బెంచ్ లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అందులో సివిల్ కేసులు - 01, క్రిమినల్ కేసులు - 37, గృహ హింస చట్టం కేసు - 01, ప్లీ బార్గయినింగ్ ద్వారా రాజీ అయిన కేసులు - 96, మనోవర్తి కేసులు - 05, హిందూ మ్యారేజ్ ఓపి కేసు - 01, పియల్సిలు - 03 మొత్తం 144 కేసులకు రూ.35,41,326/-లభించినట్లు తెలిపారు. ఈ అదాలత్ లో సభ్యులుగా డిఆర్ రాజేశ్వర రావు, బి.గౌరీపతిరావు, బి.శ్రీనివాసరావు, టెక్కలి న్యాయవాదుల సంఘము అధ్యక్షులు డివి వివేకానంద ఇతర న్యాయవాదులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులకు ఉపయోగపడుతున్న 'డ్రోన్'

ఎమ్మెల్యే, బగ్గు రమణమూర్తి

విశాలాంధ్ర - నరసన్నపేట : నేటి ఆధునిక వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు డ్రోన్ ఎంతగానో ఉపయోగపడుతుందని నియోజకవర్గ ఎమ్మెల్యే, బగ్గు రమణమూర్తి అన్నారు. శనివారం కత్తిరివానిపేట గ్రామంలో ఆయన వ్యవసాయ క్షేత్రంలో వరి పంటకు డ్రోన్ ద్వారా యూరియా, డి.ఏ.పి ఎరువులు వేయ టంతో పాటు క్రిమిసంహారక మందులు పిచికారీ వ్యవసాయ అధికారుల సూచనల మేరకు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించే రైతులు అధిక దిగుబడి సాధిస్తారని, వ్యవసాయ రంగంలో సరికొత్త ఆవిష్కరణలకు ప్రతీ ఒక్క రైతు శ్రీకారం చుట్టాలని కోరారు. వ్యవసాయ రంగంలో కూలీల కొరత అధికంగా వున్న నేపధ్యంలో డ్రోన్‌లను ఉపయోగించు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి, కె.శ్రీధర్, శ్రీకాకుళం వ్యవసాయశాఖ ఏడి, భవానీశంకర్, నియోజకవర్గ వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరక్టర్, కె.రవీంద్రభారతి, మండల ఏ.వో, చిరంజీవిరావు, రైతులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి : ట్రాఫిక్ సిఐ నాగరాజు

విశాలాంధ్ర - శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైమ్ : ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని లేనియెడల తగిన చర్యలు తీసుకుంటా మని నూతన ట్రాఫిక్ సిఐ వి.నాగరాజు తెలిపారు. గతంలో వైజాగ్ సిటీ ట్రాఫిక్ సిఐగా పనిచేసి సాధారణ బదిలీలు లో భాగంగా, ఇక్కడికి వచ్చారు. శనివారం పదవి బాధ్యతలు తీసుకొని మీడియాతో మాట్లాడుతూ, ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా మైనర్ డ్రైవింగ్ లుకు ఎవరు ప్రోత్సహించిన చట్టపరమైన చర్యలు ఉంటాయని, డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన వారు మాత్రమే వాహనాలు నడపాలని తెలిపారు. రహదారులపై మితిమీరిన వేగం తో ప్రయాణాలు చేయరాదని, అటువంటి ప్రయాణం చేస్తే ప్రమాదాలకు గురికావాల్సి ఉంటుందని తప్పనిసరిగా హెల్మెట్ వాడకం చేయాలని తెలిపారు. సెల్ఫోన్ డ్రైవింగ్ , త్రిబుల్ రైట్స్ చేస్తే కేసులు నమోదు చేయడం జరుగుతుందనీ, అందువల్ల అందరూ ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలని పోలీస్ సిబ్బందికి సహకరించాలన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ట్రాఫిక్ లో అవగాహన కల్పించి, ట్రాఫిక్ నిబంధనలు, పాటించే విధంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

విశాలాంధ్ర కథనానికి స్పందన

విద్యుత్ స్తంభానికి అల్లుకున్న మొక్కలను తొలగింపు

విశాలాంధ్ర - టెక్కలి : 13వ తేదీ శుక్రవారం విశాలాంధ్ర పత్రికలో ప్రచురించిన "అల్లుకున్న తీగలు... పొంచి ఉన్న ప్రమాదం"అనే కథనాని పై శనివారం స్పందన లభించింది. విద్యుత్ శాఖ ఏఈ ఆదేశాల మేరకు లైన్ ఇన్స్పెక్టర్ కోదండరావు స్పందించారు. మండలంలో స్థానిక ఎన్టీఆర్ కాలనీ గ్రామ సచివాలయం 1 ఎదురుగా ఉన్న విద్యుత్తు స్తంభం చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలను, అల్లుకున్న తీగలను తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ట్రాన్స్ఫార్మర్ వద్ద గాని, విద్యుత్తు స్తంభాలు వద్ద గాని పిచ్చి మొక్కలు ఉన్న, విద్యుత్తు తీగలకు మొక్కలు అల్లుకొని ఉన్న తమకు తెలియజేయాలని కోరారు. ప్రమాదాలు జరగక ముందే విద్యుత్ అధికారులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించినందుకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. లైన్ ఇన్స్పెక్టర్ తో పాటు జేఎల్ఎం బాబురావు సిబ్బంది ఉన్నారు.

ఎన్టీఆర్ ఇళ్ళు పెండింగ్ బిల్లులు పరిశీలించిన హౌసింగ్ అధికారులు

విశాలాంధ్ర - నరసన్నపేట : మండలంలో పారశిల్లి, రెల్లివలస గ్రామాల్లో శనివారం పంచాయితీ సర్పంచ్, డబ్బీరు కిరణ్‌చంద్ పట్నాయిక్ ఎన్టీఆర్ ఇళ్ళు పెండింగ్ బిల్లులను పరిశీలించారు. ఈ సంధర్భంగా గ్రామాల్లో సుమారు 34 ఇళ్ళకు చెందిన లబ్ధి దారులతో మాట్లాడుతూ గత 2014వ సంవత్సరం తెలుగుదేశం ప్రభుత్వం హాయాంలో నిర్మాణం చేసుకున్న ఎన్టీఆర్ ఇళ్ళు కొన్ని పూర్తి స్థాయిలో నిర్మాణాలు చేసుకోగా, మరికొన్ని అసంపూర్తిగా నిర్మాణంలో ఆగిపోయాయని అన్నారు. పెండింగ్‌లో వున్న బిల్లులను పరిశీలించి, హౌసింగ్ అధికారుల సహకారంతో బిల్లులు పడేటట్లు చేస్తామని సర్పంచ్, కిరణ్‌చంద్ పట్నాయిక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్, భైరి రామారావు, టిడిపి నాయకులు, గంగు చలపతిరావుతో పాటు హౌసింగ్ ఇన్‌స్పెక్టర్, శ్రీనివాసరావు, జూనియర్ ఇంజనీర్, షేక్ షరీఫ్ పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేసిన ఎమ్మెల్యే రమణమూర్తి

విశాలాంధ్ర - జలుమూరు : జలుమూరు మండలం గుగ్గిలి పంచాయతీ గుండువలస గ్రామానికి చెందిన గొండు త్రినాధరావుకు మోకాలు కీలు మార్పిడి కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నయుడు ప్రత్యేక నిధి నుండి 1,08600 రూపాయలు నరసన్నపేట శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి బాదితుడుకు శనివారం స్వయంగా అందజేశారు. నిధులతో ఆయన కాలు బాగు చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఆయనతో పాటు పలువు టిడిపి నేతలు పాల్గొన్నారు.

గార ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన జనార్ధన్

విశాలాంధ్ర - శ్రీకాకుళం రూరల్ : గార పోలీస్ స్టేషన్ నూతన ఎస్.ఐగా రెల్ల జనార్ధన్ శనివారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా అనకాపల్లి డీపీవో కార్యాలయం నుండి గార పోలీస్ స్టేషన్ ఎస్.ఐగా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఎస్.ఐ జనార్ధన్ మాట్లాడుతూ గార మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు గట్టి చర్యలు చేపడతామన్నారు.

వన్ టౌన్ ఎస్ఐగా హరికృష్ణ బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర - శ్రీకాకుళం స్పోర్ట్స్/ క్రైమ్ : శ్రీకాకుళం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ నూతన ఎస్.ఐగా ఎం.హరికృష్ణ శనివారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా రెండో పట్టణ పోలీస్ స్టేషన్లో ఎస్సైగా విధులు నిర్వహిస్తూ ఇప్పుడు వన్ టౌన్‌కి ఎస్సైగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్.హరికృష్ణ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు గట్టి చర్యలు చేపడతామన్నారు.

గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించండి

గిరిజన ఐక్యవేదిక సభ్యులు

విశాలాంధ్ర - జలుమూరు : శ్రీకాకుళం మన్యం జిల్లాల్లో గిరిజన ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్‌కు గిరిజన ఐక్యవేదిక సభ్యులు శనివారం ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయనతో పాటు ఎస్ హేమలత గిరిజన ఐక్యవేదిక మహిళా అధ్యక్షులు మినీ గురుకులాల రాష్ట్ర అధ్యక్షులు ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. వినతిపత్రం స్వీకరించిన హుస్సేన్ పరిష్కారానికి కృషి చేస్తానని గిరిజన ఐక్యవేది సభ్యులకు హామీ ఇచ్చారు.

17 నుంచి స్వచ్ఛతాహి సేవా : జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

విశాలాంధ్ర - శ్రీకాకుళం : ఈనెల 17 నుండి అక్టోబర్ 2వ తేదీ వరకు జిల్లాలో స్వచ్ఛతాహి సేవా కార్యక్రమం నిర్వహణకు సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన మున్సిపల్ కమిషనర్లు, జిల్లా పంచాయతీ, పాఠశాల విద్య, వైద్య ఆరోగ్య శాఖ తదితర శాఖల అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి జిల్లాలో స్వచ్ఛతాహి సేవా కార్యక్రమ నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. ఈ కార్యక్రమంపై ప్రజలకు మరింత అవగాహన కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని, ప్రజలు స్వచ్ఛంద సేవా సంస్థలు, విద్యా సంస్థలను పెద్ద ఎత్తున భాగస్వామ్యం చేయాలని సూచించారు. అన్ని గ్రామాలు, పట్టణాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం, శ్రమదానం ద్వారా వ్యర్థపదార్థాలు తొలగింపు కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. మున్సిపల్ కమిషనర్లు, మండల పరిషత్, పంచాయతీ అధికారులు, పంచాయతీ కార్యదర్శులను సమన్వయం చేసుకుంటూ స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఎక్కువగా చెత్త పోగయ్యే బ్లాక్ స్పాట్స్ గుర్తించాలని, పరిశుభ్రతకు చర్యలు తీసుకోవాలన్నారు. బహిరంగ ప్రదేశాలు, కార్యాలయాలు, విద్యాసంస్థలు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, పర్యాటక ప్రదేశాలు వంటి చోట్ల సామూహిక స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమ నిర్వహణ కోసం నియోజకవర్గానికి ఒక డ్రోన్ చొప్పున కేటాయిస్తున్నామని వీటి ద్వారా పారిశుద్ధ్య నిర్వహణ అత్యవసరమైన ప్రదేశాలను సులభంగా గుర్తించవచ్చన్నారు. అక్టోబర్ 2న మహాత్మా గాంధీ జయంతి పురస్కరించుకుని స్వచ్ఛభారత్ దివస్ కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా నిర్వహించాలన్నారు. ఇందులో భాగంగా ప్రత్యేక గ్రామసభలు, సఫాయి మిత్రలు, పారిశుద్ధ్య సిబ్బందిని సత్కరించాలన్నారు. హెల్త్ చెకప్ లు నిర్వహించాలని, వారందరికీ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయి లేనిది పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు

పారిశుద్ధ్య పనులు మెరుగుపరచాలి : మంత్రి అచ్చెన్న

విశాలాంధ్ర - టెక్కలి : మండలంలో పారిశుద్ధ్య పనులు మెరుగుపరచాలని రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఈ సందర్భంగా శనివారం మేజర్ పంచాయతీ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. టౌన్‌లో పారిశుద్ధ్య పనులు మెరుగుపరచాలని, ప్రతి వీధులలో విద్యుత్తు దీపాలు ఉండేలా చూసుకోవాలని, విద్యుత్ మరమ్మత్తులు పనులు వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. పంచాయతీలో ఉన్న ప్రతి ఒక్కరూ ఇంటి పన్నులు, లైసెన్సులు, ప్రొఫెషనల్ టాక్స్ తప్పనిసరిగా చెల్లించేలా చూసుకోవాలని అధికారులకు సూచించారు. ఇంటి పన్ను విషయంలో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తీసుకుంటామని అన్నారు. రోడ్లపై గోవులు సంచారాన్ని అరికట్టేందుకు గోవుల సంరక్షణశాలను పది రోజుల్లో ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులు సమస్యలు అడిగి తెలుసుకుని వారికి అవసరమైన సామాగ్రిలు త్వరలోనే అందజేస్తామని తెలిపారు. రైతన్నలకు ఎలాంటి కష్టాలు లేకుండా అన్ని విధాలుగా కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందని అన్నారు. గత ప్రభుత్వం రైతాంగాన్ని తీవ్రంగా మోసం చేసిందని, ఐదేళ్లపాటు రైతు బీమాను కూడా చెల్లించలేదని అన్నారు. గత ఐదేళ్లలో ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా రైతాంగం తీవ్రంగా నష్టపోయిందని విమర్శించారు. టీడిపి ప్రభుత్వం హయాంలో రైతులకు 20వేల రూపాయలు వరకు చెల్లించామని, గత ప్రభుత్వం వాటిని పంచకపోగా 16 వేలుకు కుదించిందని అన్నారు. కనీసం రైతులకు ఇన్సూరెన్స్ కూడా ఐదేళ్లపాటు కట్టలేదని తద్వారా రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం, నర్సింగపల్లి పంచాయతీ మాజీ ఎంపీటీసీ దారపు జోగారావు సంతాప సభలో మంత్రి పాల్గొని, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.

శ్రీ జ్ఞానజ్యోతిలో ఘనంగా హిందీ దివస్

విశాలాంధ్ర - నరసన్నపేట : పట్టణంలో మారుతీనగర్-2వ వీధిలో వున్న శ్రీ జ్ఞానజ్యోతి స్కూల్‌లో శనివారం హిందీ దివస్ కార్య క్రమం విధ్యార్థులతో ఘనంగా నిర్వహించారు. ఈ సంధర్భంగా విధ్యార్థులకు ప్రతిభా పరీక్షలు నిర్వహించి, హిందీ ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం చేశారు. అనంతరం స్కూల్‌కు చెందిన విధ్యార్థులు హిందీ దివస్‌గా అక్షరాల రూపంలో సమకూర్చటం జరి గింది. ఈ కార్యక్రమంలో హిందీ ఉపాధ్యాయులు, పాఠశాల మేనేజ్‌మెంట్ ప్రతినిధులు, బోర రామారావు, వెలమల భాస్కరరావు, తర్ర రామకృష్ణ, పాగోటి లక్ష్మీ, స్కూల్ ఉపాధ్యాయ సిబ్బంది, విధ్యార్ధినీ విధ్యార్థులు పాల్గొన్నారు.

గంజాయిపై ఉక్కు పాదం మోపుతాం : డి.ఎస్.పి వివేకానంద్

విశాలాంధ్ర - ఆమదాలవలస : గంజాయి స్మగ్లింగ్ పై ఉక్కు పాదం మోపుతామని డీఎస్పీ వివేకానంద తెలిపారు. శనివారం ఆమదాలవలసలో గంజాయి విక్రయిస్తున్న ఐదుగురిని అరెస్టు చేసిన సందర్భంగా మాట్లాడారు. చెడు వ్యసనా ల బారిన యువత పడి వారి జీవి తాన్ని నాశనం చేసుకుంటున్నారని అటువంటి వారిని గుర్తించి విశాఖపట్నంలోని రిహా బిలేషన్ సెంటర్ కు పంపించి చికిత్స చేయిస్తామన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేర కు జిల్లా ఎస్పీ వంద రోజులు యాక్ష న్ ప్లాన్ ను సమర్థవంతంగా నిర్వహించి గంజాయి విక్రయ దారుల ను పంపిణీ దారులను ఎక్కడికక్కడ పట్టుకుంటున్నా మని వివరించారు. దీనిపై అన్నిచోట్ల ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపా రు. ఆముదాలవలస లో గంజాయి విక్ర యిస్తున్నట్లు సమాచారం తెలుసుకున్న ఆముదలవలస సీఐ సత్యనారాయణ, ఎస్సై వెంకటేష్, సిబ్బందితో కలిసి బి ఆర్ నగర్ లో ఉన్న వారిని గుర్తించి వారి వద్ద నుంచి సుమారు రెండున్నర కేజీల గంజా యిని స్వాధీనం చేసుకొని ఐదుగురిని శుక్రవారం సాయంత్రం అదుపులోకి తీసు కున్నామన్నారు. ఈ గంజాయి ఒరిస్సా నుంచి తెచ్చి ఆముదాలవలస కేంద్రంగా ఎంచుకొని చిన్నచిన్న పొట్లాలుగా తయారుచేసి విక్రయిస్తున్నారు అని తెలిపారు. పట్టణంలోని ఒక సాధువు పీతాంబరం ద్వారా కాళి ప్రసాద్, శ్రీనివాస్, లోకేష్, వెంకటరమణ, సిరియా లను అదుపులోకి తీసుకున్నామన్నారు. వీరి వద్ద. 2.5 కేజీలు గంజాయి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఆముదాల వలస ప్రాంతంలో పలువురుకు గంజాయి వెక్కిరిస్తున్నట్లు వీరి వద్ద నుంచి సమాచా రం సేకరించామన్నారు. ముఖ్యంగా తల్లి దండ్రులు పిల్లల అలవాట్లను గమనించి చర్యలు తీసుకోవాలన్నారు. మా జాబితాలోకి వచ్చిన పేర్లను వారి తల్లిదండ్రు లను పిలిపించి పిల్లలకు విశాఖలోని రిహాబిలేషన్ సెంటర్ కు తరలించి చికి త్స అందించ నుందామని వివరించారు. గంజాయికి అలవాటు పడిన వారిని గుర్తించి వారి తల్లిదండ్రులు తెలియజేసి వారికి మంచి మనుషులుగా తయారు చేయాలనే ఉద్దేశంతో చర్యలు చేపడు తున్నాం అన్నారు. ఈ సమావేశంలో సీఐ సత్యనారాయణ, ఎస్ ఐ వెంకటేష్ లు వున్నారు. పట్టుబడిన వారిని అరెస్టు చేసి కోర్టుకు తరలిచన్నమని తెలిపారు.

కలెక్టర్‌కు సమస్యలు వివరించిన ఎమ్మెల్యే మామిడి

విశాలాంధ్ర-కొత్తూరు : శ్రీకాకుళం కలెక్టర్ స్వప్నల్ దినకర్‌ని పాతపట్నం నియోజకవర్గం శాసనసభ్యులు మామిడి గోవిందరావు శనివారం మర్యాదపూర్వకంగా కలిసారు. 175 నియోజకవర్గాల్లో పాతపట్నం భాగా వెనుకబడి ఉంది నియోజకవర్గంలో, ఉపాధి కోసం వలసలు ఎక్కువ. ఈ వలసలను అరికట్టే విధంగా విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలపై ఉపాధి మరియు ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా మాకు సహకరించి,గిరిజన గ్రామాలకు అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాలని, మా నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారించాలని. కలెక్టర్‌ను ఎంఎల్ఏ మామిడి కోరారు. కాగా అంతేక ముందు కలెక్టర్ స్వప్నల్ దినకరన్ ను ఎంఎల్ఏ మామిడి గోవిందరావు శాలువా కప్పి అభినం.చారు ఏం.ఎల్.ఏ మామిడి వెంట కొత్తూరు టీడీపీ నాయకులు మాజీ ఎంపీటీసీ కోయిలాపు సంజీవరావు భామిని రాజు తదితరులు న్నారు.

హరిపురం ఉన్నత పాఠశాల విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-పలాస : వినాయక ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో అట్టహాసంగా వివిధ గ్రామాలలో జరుగుతున్న జిల్లా స్థాయి క్విజ్ పోటీలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్, హరిపురం విద్యార్థులు చిన్న బహడపల్లి, లింబుగాం, బిఎస్ పురంలలో ప్రథమ స్థానం, ఏకువూరులో తృతీయ స్థానం పొందడం ద్వారా వరుస విజయాలు సాధించడంపట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.ఉమారాజ్ మరియు ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు జి ఉమారాజ్ మాట్లాడుతూ పాఠశాలలో ఉన్నత స్థాయి మౌలిక వసతులు, క్రీడా ప్రాంగణం తో పాటు ఉపాధ్యాయుల అంకిత భావం, గ్రామస్తుల సహకారం తోడై విద్యార్థులు అన్ని రంగాలలో విజయాలు సాధించడానికి తోడ్పాటు అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్ సాంబమూర్తి, ఎం చక్రధరరావు జితేజేశ్వరరావు, జి రమణ బాబు, జి కోదండరావు, పి.లోకనాథం, పి జగన్ మోహన్‌రావు, డి కృష్ణారావు,సంతోష్ కుమార్ పండ, కే అరుణకుమారి, ఎస్ రామారావు, ఎస్ రేణుక, బి తిరుపతిరావు, బి లక్ష్మీనారాయణ,కే మంజుల, ఎన్ ఈశ్వరి, ఎస్ తులసి, పి.ఇందుమతి, ఎస్ స్వప్న, కే సాంబమూర్తి, ఎస్ ప్రభాకర్‌రావు, కే శేషగిరిరావు, బి రామారావు, బి శశికళ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానంలో అపశృతి..గుండె పోటుతో వ్యక్తి మృతి

విశాలాంధ్ర-పలాస : అన్నదానం చేస్తుండగా ఓ వ్యక్తి గుండెపోటుకు గురై మృతి చెందిన సంఘటన పలాస మండలం బ్రాహ్మణతర్లా గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. ప్రత్యక్షసాక్షుల కథనం మేరకు వివరాలు ఈ విధంగా ఉన్నాయి. బ్రాహ్మణతర్లా బజారు వీధిలో గణపతి నవరాత్రులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్నదానం ప్రారంభం కాగా పూజా కమిటీలో సభ్యుడిగా ఉన్న పట్నాల తిరుపతిరావు(59) అనే వ్యక్తి భక్తులకు అన్నప్రసాదాన్ని అందిస్తున్నారు. అకస్మాత్తుగా ఆయన ఛాతీలో నొప్పి ప్రారంభం కాగా ప్రక్కనే ఉన్న మరో సభ్యుడికి విషయాన్ని చెప్పాడు. ఆయనను పరీక్షిస్తున్నంతలోపే తిరుపతిరావు కూలబడిపోవడంతో స్థానికులు సపర్యలు చేశారు. అనంతరం ఆసుపత్రికి తరలించేందుకు సిద్ధమవగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. దీంతో గ్రామంలో పాటు వారి ఇంటిలో తీవ్ర విషాదఛాయలు అలముకున్నాయి. మృతుడు లైన్ వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మృతుడుకు బార్య అన్నపూర్ణ, ఇద్దరు కుమార్తెలు లక్ష్మి, ప్రియాంక ఉన్నారు.

ఎస్టీ మాకి వలస సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

ఎస్టి కమిషన్ సభ్యులు హుస్సేన్

విశాలాంధ్ర-జలుమూరు: మండలం మర్రివలస పంచాయతీ ఎస్టీ మాకివలస గ్రామ గిరిజన సోదరుల సమస్యలను పరిష్కరించే వరకు పోరాటం ఆగదని ఎస్టీ సెల్ కమిటీ సభ్యులు జటోతు హుస్సేన్ నాయక్ అన్నారు. జలుమూరు మండలం ఎస్టీ మాకి వలస గ్రామంలో ఉన్న గిరిజన సమస్యలను శనివారం స్వయంగా పరిశీలించారు. అక్కడ కష్టాలు సుఖాలను గిరిజన అడిగి తెలుసుకున్నారు. తరతరాల నుండి ఇక్కడ భూమిని సాగు చేస్తూ ఇల్లు నిర్మించుకొని బ్రతుకుతున్న తమకు పెత్తందారులు పొమ్మంటున్నారని కుటుంబాలతో వెళ్లేది ఎక్కడికని పలువురు గిరిజనులు కమిటీ సభ్యులు హుస్సేన్ ముందు విన్నవించారు. దీంతో ఆయన స్పందిస్తూ మీ సమస్య పరిష్కారం అయ్యేవరకు పోరాటం జరుగుతుందని ఆయన హామీ ఇచ్చారు. ఆదివాసి రాష్ట్ర నాయకులు వాబయోగి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో శ్రీకాకుళం రెవిన్యూ డివిజనల్ అధికారి రంగయ్య, సీతంపేట సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ డైరెక్టర్ యశ్వంత్ కుమార్ రెడ్డి, తాసిల్దార్ జి లక్ష్మీనారాయణ, ఎంపీడీవో పి ఉమామహేశ్వరరావు, నరసన్నపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, పలువురు అధికారులు స్థానికులు పాల్గొన్నారు. ముందుగా కమిటీ సభ్యులు హుస్సేన్ కి గిరిజనులు స్వాగతం పలికారు.

పలు కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే రవణమూర్తి

విశాలాంధ్ర-జలుమూరు: సారవకోట జలుమూరు మండలాలు వివిధ గ్రామాల్లో అనారోగ్యంతో మరణించిన వారి కుటుంబాలకు నరసన్నపేట శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి శనివారం పరామర్శించారు. సారవకోట మండలం గొర్రెబంద గ్రామానికి చెందిన ఈనాడు విలేఖరి ఆనందరావు తల్లి పంకజమ్మ మృతితో ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. నవతల గ్రామంలో మరణించిన రామారావు కుటుంబ సభ్యులకు వెంకన్నపేట గ్రామంలో అనారోగ్యంతో మరణించిన కిట్టాలపాడు పాలయ్య కుటుంబ సభ్యులకు జలుమూరు మండలం అల్లాడిపేట గ్రామ మాజీ ఎంపీటీసీ సభ్యురాలు అక్కమ్మ మరణించడంతో ఆమె కుటుంబాన్ని శాసనసభ్యులు రమణమూర్తి పరామర్శించారు. ఆయనతోపాటు ఐటీడీపీ కన్వీనర్ సురవరపు తిరుపతిరావు, పట్టా ఉమామహేశ్వరరావు, దేవరాజు మంద పాపారావు, సత్యనారాయణ, సనపల రమణ, దుద్ది రాజేశ్వరరావు, పిల్ల నందకిషోర్ దువ్వార్ జయరాం అభిమానులు పాల్గొన్నారు.

లోక్‌అధాలత్లో 104 కేసులు పరిష్కారం

విశాలాంధ్ర-పొందూరు: మండలకేంద్రంలో జూనియర్ సివిల్ కోర్టులో శనివారం జడ్జి బి. జ్యోత్స్న అధ్యక్షతన నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్లో వివిధ రకములైన 104 కేసులను పరిష్కరించారు. సుదీర్ఘకాలం విచారణలతో ఇబ్బంది లేకుండా కేసులు సత్వర మే పరిష్కరించుకునేందుకు లోక్‌అదాలత్ ఒక చక్కటి వేదికని జడ్జి జ్యోత్స్న అన్నారు. ఈ లోక్ అధాలత్ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు కె. రమణమూర్తి, బ్రహ్మాజీ, రామ్మోహన్, సురేష్ తదితరులు పాల్గొని కేసులు రాజీ చేయడంలో సహాయసహకారాలు అందించారు.

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

విశారాంధ్ర-పొందూరు: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఎక్సైజ్శాఖామంత్రి కొల్లు రవీంద్ర చిత్రపటాలకు శనివారం స్థానిక ఎక్సైజ్ స్టేషన్లో ఎక్సైజ్ సిబ్బంది. టీడీపీ నాయకులు పాలాభిషేకం చేసారు. ముఖ్యమంత్రి రాష్ట్రంలో స్పెషల్ ఎన్ఫోర్సుమెంటు బ్యూరో (ఎస్ఈబీ)ని రద్దు చేస్తూ పాత విధానం ఎక్సైజ్ విధానం తీసుకురావడం పట్ల సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తారు, చంద్రబాబు. కొలి రవీంద్ర చిత్రపటాలకు పాలాభిషేకం పుష్పాభిషేకం చేసి స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు సీహెచ్ రామ్మోహన్, స్టేషన్ ఎస్సై ఈ రామకృష్ణ సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ళ నిర్మాణాలపై దృష్టి పెట్టాలి

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : పేదలకు కేటాయించిన ఇళ్ళ నిర్మాణాలను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమీషనర్ ఎన్. రమేష్ అన్నారు. గురువారం వార్డు ఎమెనిటీస్ వెల్ఫేర్ సెక్రెటరీలతో హౌసింగ్ కార్యక్రమం పై సమీక్ష నిర్వాహించారు. హౌసింగ్ ఏ.ఈ ప్రసాద్‌తో కలిసి కమిషనర్ మాట్లాడుతూ నిర్మాణాలు పెండింగ్‌లో ఉన్న లబ్ధిదారులను కలిసి వారికి అవగాహన కల్పించి ఇళ్ళు కట్టుకోవడానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడి దృష్టికి గిరిజనుల సమస్యలు

విశాలాంధ్ర-కొత్తూరు : పాతపట్నం నియోజకవర్గంలో శనివారం పర్యటించిన జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ నాయక్, ఎస్టీ కమిషన్ అధికార బృందానికి కి పాతపట్నం నియోజకవర్గం బీజేపీ సీనియర్ నాయకుడు సిరిపురం తేజేశ్వరరావు ఘన స్వాగతం పలికారు. అనంతరం నియోజకవర్గం లోని గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమగ్ర వినతిపత్రం అందజేసినట్లు సిరిపురం కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. సిరిపురం తేజేశ్వరరావు తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యల పరిష్కారం పట్ల ఎస్టీ కమిషన్ బృందం సానుకూలంగా స్పందించిందిసిరిపురం వినతిపత్రం లోని ప్రధాన అంశాలు: శ్రీకాకుళం జిల్లా పాతపట్నం నియోజకవర్గంలోని గిరిజనుల సమస్యల పరిష్కారం కోసం. రాష్ట్రంలోని అత్యంత వెనకబడిన నియోజకవర్గాల్లో శ్రీకాకుళం పాతపట్నం నియోజకవర్గం ఒకటి. 2011 జనాభా లెక్కల ప్రకారం ఇక్కడ దాదాపు 15 శాతం గిరిజన జనాభా ఉంది. 35 వేల మందికి పైగా ఓటర్లు ఉన్నారు. మెళియాపుట్టి, కొత్తూరు, హిరమండలం, పాతపట్నం, ఎల్.ఎన్.పేట ఈ అయిదు మండలాల పరిధిలోనూ గిరిజన గ్రామాలున్నాయి. అయితే స్వతంత్రం వచ్చి దశాబ్దాలు గడుస్తున్న ఇప్పటికీ ఆయా గ్రామాలు, అక్కడి ప్రజలు విద్యా, వైద్యం, రక్షిత తాగునీరు, రహదారులు వంటి కనీస మౌలిక వసతులకు నోచుకోక ఇబ్బందులు పడుతున్నారు. మా నియోజకవర్గంలోని గిరిజన ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఈ వినతిపత్రం ద్వారా మీ దృష్టికి తీసుకొస్తున్నాను. వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటారని విన్నవించుకుంటున్నాను. గత వైకాపా ప్రభుత్వ హయాంలో చేపట్టిన జిల్లాల పునర్విభజన వల్ల సీతంపేట ఐటీడీఏ పూర్తిగా పార్వతీపురం మన్యం జిల్లా పరిధిలోకి వెళ్లిపోయింది. శ్రీకాకుళం జిల్లాకు ప్రత్యేకంగా ఐటీడీఏ అంటూ లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో అత్యధిక గిరిజన జనాభా కలిగిన పాతపట్నం నియోజకవర్గం మెళియాపుట్టి మండలానికి ఐటీడీఏ మంజూరు చేయించి వెంటనే ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోగలరు. నియోజకవర్గంలోని గిరిజనులు కనీస వైద్య వసతులకు నోచుకోవట్లేదు. చిన్నపాటి విషజ్వరం వచ్చినా ప్రాణాలు కోల్పోవలసిన దయనీయ స్థితి. అయిదు మండలాల గిరిజనులకు అందుబాటులో ఉండేలా పాతపట్నం నియోజకవర్గం కేంద్రంలో అత్యాధునిక వసతులతో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని, ప్రభుత్వ వైద్య కళాశాలను మంజూరు చేసేలా చర్యలు తీసుకోగలరు. నియోజకవర్గంలోని గిరిజన ప్రాంతాల్లో పెద్దఎత్తున మాతాశిశు మరణాలు చోటుచేసుకుంటున్నాయి. 2019-20లో 432 మంది శిశువులు, 23 మంది బాలింతలు, 2020-21లో469 మంది శిశువులు, 24 మంది బాలింతలు, 2021-22లో 246 మంది శిశువులు, 24 మంది బాలింతలు మరణించారు. సరైన వైద్య సేవలు అందకే ఈ దయనీయ పరిస్థితి. వీటికి అడ్డుకట్ట వేసేలా చర్యలు తీసుకోగలరు. మెళియాపుట్టి మండలంలోని కేరాశింగి, గూడ, చందనగిరి, అడ్డివాడ, దబ్బగుడ్డి, పెద్దకేదారి, చిన్నాకేదారి,

ముత్యాలబొంతు, రింపి, అంపురం వంటి గ్రామాలకు అంబులెన్స్‌లు, ఇతర వాహనాలు వెళ్లలేని దుస్థితి నెలకొంది. ఇటువంటి గ్రామాలకు ఫీడర్ అంబులెన్స్‌లు ఏర్పాటు చేసినా.. తరచూ మొరాయిస్తుండడంతో గిరిజనులకు ఇబ్బందులు తప్పడం లేదు. అలాగే దబ్బగుడ్డి విద్యార్థులు కొండలు దిగి పాఠశాలకు వెళ్లేందుకు ఆపసోపాలు పడుతున్నారు. కనీస రహదారి సౌకర్యానికి నోచుకోని ఇలాంటి గిరిజన గ్రామాలు నియోజకవర్గంలో అనేకం ఉన్నాయి. అక్కడ వసతులు మెరుగుపరచాలి. నియోజకవర్గంలోని గూడ, కేరాసింగి, చందనగిరి, దీనబంధుపురం, బాణాపురం, కేరాసింగి, పెద్ద కేదారి తదితర గిరిజన గ్రామాలో తాగునీటి పథకాలు పనిచేయక ఇప్పటికీ ఊటబావుల నీరే అక్కడి ప్రజలకు దిక్కవుతుంది. ఇది అనేక అనారోగ్య సమస్యలకు కారణమవుతోంది. నియోజకవర్గంలోని ప్రతి గిరిజన గ్రామానికి సురక్షిత తాగునీరు అందేలా చర్యలు చేపట్టగలరు ఇవి గాక తదితర. గిరిజన సమస్యలను ఏస్టి కమిషన్ దృష్టికి సుకు వెళ్లినట్లు తెలిపారు.

నులి పురుగులను నివారిద్దాం : జిల్లా వైద్య ఆరోగ్య అధికారిని డా.బి. మీనాక్షి

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: నులిపురుగులను నివారించేందుకు పిల్లలందరికి ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారిని డా.బి. మీనాక్షి అన్నారు. ఈనెల 17వ తేదీన మంగళవారం డీ వార్మింగ్ డే ను నిర్వహించడం జరుగుతుందని, ఆరోజు మాత్రలు వేసుకోని వారికి డీ వార్మింగ్ మాపాప్ దేను 25వ తేదీన జరుగుతుందన్నారు. రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం పాఠశాల ఆరోగ్య పథకంలో భాగంగా ఈనెల 17 తేది మంగళవారం డీ వార్మింగ్ డే జరుపుటకుకొనుటకు ప్రభుత్వం వారు నిర్ణయించినట్లు తెలిపారు. జిల్లాలో ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలు, జూనియర్ కళాశాలల విద్యార్థులకు డివార్మింగ్ మాత్రలు (ఆల్బెండజోల్-400 మీ.గ్రా. నమిలి తినిపించడం జరుగుతుందని చెప్పారు. అంగన్వాడీ కేంద్రాలలో 1 నుండి 2 సం.ల వరకు 1/2 మాత్ర, 2 నుండి 19 సం.ల వరకు 1మాత్ర,చొప్పున స్కూల్స్‌కు వెళ్ళని పిల్లలకు అంగన్వాడి కార్యకర్తల ద్వారా ఈ మాత్రలు వేయించబడునని వివరించారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ స్కూలు, కాలేజీలలో ఆల్బెండజోల్ మాత్రలను డీ వార్మింగ్ డే రోజున విద్యార్థులకు డీ వార్మింగ్ మాత్రలు (ఆల్బెండజోల్ -400 మీ.గ్రా.) వయస్సు కు తగ్గ మోతాదు బట్టి నమిలి తినిపించేలా కావలసిన చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి పాఠశాలలో ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నిర్దేశించిన ప్రణాళిక ప్రకారం ఈ కార్యక్రమం జరుపబడునని వివరించారు. మధ్యాహ్నం భోజనం తరువాత ప్రతి విద్యార్థికి మోతాదు ప్రకారం నమిలి మింగిస్తారని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమం లో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, విద్యా శాఖ సిబ్బంది, (ఉపాధ్యాయులు), అంగన్వాడీ కార్యకర్తలు సమన్వయముతో జరుగుతుందన్నారు.జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు మొత్తం 6,689 ఉండగా, అందులో చదువుకొనే విద్యార్థులు 4 లక్షల 70 వేల 738 మంది ఉన్నారు , జిల్లాలో బడికి వెళ్లకుండా ఉన్న పిల్లలు, అంగన్వాడీ కేంద్రాల్లో 1-5 సంవత్సరాల పిల్లలుకు అందజేయడం జరుగుతుందని, మాత్రలు సిద్దంగా ఉన్నాయన్నారు. జిల్లాలో ఆల్బెండజోల్ మాత్రల వినియోగం శతశాతం జరిగేలా చర్యలు చేపట్టడం జరిగింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారుల పర్యవేక్షణలో అన్ని పాఠశాలలకు మాత్రలు పంపిణీకి సిద్ధం అన్నారు. వైద్య సిబ్బందితో పాటు, అంగన్వాడీ కార్యకర్తలు, స్వచ్ఛంద సేవా సంఘాలు సమన్వయంతో విజయవంతం చేయాలన్నారు. మండల పరిధిలో ఉన్నా పి.హెచ్.సి వైద్యాధికారులు, ఎం.పి.డి.ఒ.లు , ఎం.ఇ.ఒ.లు , సి.డి.పి.ఒ.లు , సి.ఆర్.పి. లు ద్వారా పర్యవేక్షణ జరుపబడునని, ఈ మాత్రలు వేసుకొనడం వలన ఏవిధమైన ఔషధ దుష్పరిణామాలు ఉండవని, ఒకవేళ ఔషధ దుష్పరిణామాలు కనిపించిన యెడల దగ్గరలో ఉన్న స్థానిక ఆశ కార్యకర్త , ఏ.ఎన్. ఎమ్ ల ద్వారా పి.హెచ్.సి వైద్యాధికారి కి సంప్రదించవలెనని తెలిపారు. ఈ కార్యక్రమం జిల్లా స్థాయిలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి, జిల్లా సమన్వయ అధికారి రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం, ప్రోగ్రాం ఆఫీసర్లు, జిల్లా విద్యాశాఖాధికారి, ప్రాజెక్ట్ అధికారి (ఆర్.వి.ఎం), పథక సంచాలకులు, ఐ.సి.డి.ఎస్. వారి సమన్వయం తో పర్యవేక్షణ జరుగుతుందన్నారు.

ప్రతి సమస్య పరిష్కారానికి కృషి చేస్తా

జాతీయ ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్

విశాలాంధ్ర-మెలియాపుట్టి : మారుమూల గిరిజన ప్రాంతాలలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్య పరిష్కారానికి తాను కృషి చేయడం తోపాటు సంబంధిత శాఖ అధికారుల ప్రతి ఒక్కరికి సమస్య పరిష్కారమయేంతవరకు ఆయా పనులను అప్పగించడం జరుగుతుందని జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు జటోతు హుస్సేన్ నాయక్ అన్నారు. శుక్రవారం నాడు ఆయన మెలియాపుట్టి మండలంలో గల కొండపై ప్రాంతంలోనున్న కేరాసింగి, గూడ గిరిజన గ్రామాల్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక గిరిజనులతో మమేకమవుతూ ఇక్కడున్న సమస్యలేంటి, ఏ రకమైన సేవలు అందుతున్నాయి, తదితర వాటిపై ఆయన గిరిజనులతో మాట్లాడగా ప్రధానంగా రహదారి, త్రాగునీటి, అత్యవసర పరిస్థితుల్లో వైద్య సేవలు సకాలంలో అందలేకపోవటం, విద్యుత్ సమస్యతోపాటు మౌలిక సదుపాయాలు సైతం పూర్తి స్థాయిలో అందడంలేదని ఎవరికి ఎన్ని మార్లు విన్నవించిన, కంటితుడుపు చర్యలే తప్ప పూర్తి స్థాయిలో పరిష్కారం జరగడం లేదన్నారు. ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులుగా మీరు మా గ్రామాలకు సందర్శిస్తారని తెలిసి అధికారులు హుటాహుటిన రహదారి మరమత్తు పనులు చేపట్టారని లేకుంటే మేము ఉన్నామా? లేమా! మా సమస్యలు పట్టించుకునే వారే కరువయ్యారని స్థానికులు కమిషన్ సభ్యులు దృష్టికి తీసుకుని వచ్చారు. దీనిపై కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్ మాట్లాడుతూ విద్యతోనే అభివృద్ధి సాధ్యమని, ప్రతి ఒక్కరూ చదువుకొని ప్రయోజకులు కావాలన్నారు. అధికారులతో పని చేయించుకోవడం ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని తెలియజేస్తూనే ప్రశ్నించే తత్వంతోనే స్థానికంగా ఉన్న సమస్యలను ఆయా అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేయాలని అప్పటికీ సమస్య పరిష్కారం కానట్లయితే ఫిర్యాదు రూపంలో తనకు ఆన్లైన్లో పంపించినట్లయితే దాన్ని పరిష్కారానికి నేను కృషి చేస్తానన్నారు. గిరిజన సంఘ నాయకులు పలువురు వాబ యోగి, బైరిసింగి లక్ష్మీనారాయణలు పలువురు మాట్లాడుతూ

మెలియాపుట్టి కేంద్రంగా ఐటీడీఏ ఏర్పాటుకు జాతీయ ఎస్సీ ఎస్టీ కమిషన్ వారు సిఫారసు చేయాలని, ఐటీడీఏకి సంబంధించిన నిధులు పక్కదారి పట్టుతుండడం వల్ల మారుమూల గ్రామాలలో మౌలిక సదుపాయాలు లేక తీవ్ర సమస్యలు పెరిగిపోతూన్న దుస్థితి ఏర్పడిందని, ఇకపైన ఐటీడీఏకి సంబంధించిన నిధులను పక్కదారి పట్టకుండా నేరుగా గిరిజన గ్రామాలకు మంజూరు జరిగేలా కృషి చేయాలని పలువురు కమిషన్ సభ్యులు దృష్టికి తీసుకుని వచ్చారు. అలాగే వివిధ సమస్యల పరిష్కారానికి ఆయా సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి సకాలంలో ప్రజలకు ఇబ్బంది లేకుండా చేయాలని సూచించారు. అంతకుముందు మెలియాపుట్టి మండల కేంద్రంలో నిర్మాణం జరుగుతున్న ఏకలవ్య పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్శనలో ఆయన తోపాటు ఐటీడీఏ పీవో యశ్వంత్ కుమార్ రెడ్డి, సీనియర్ ఇన్వెస్టిగేటర్ అశోక్ త్రిపాటి, ఆర్. మిశ్రా, టెక్కలి ఆర్డిఓ సుదర్శన్ దొర, తహసిల్దార్ హనుమంతరావు, ఎంపీడీవో చంద్రకుమారి, ఇంజనీరింగ్ అధికారులు, ఐసిడిఎస్, గిరిజన, వివిధ శాఖధికారులు, సిబ్బంది, గిరిజన సంఘ నాయకులు, ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, యువకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యం

ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోతు హుస్సేన్

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్ : షెడ్యూలు తెగల జీవితాలలో వెలుగు నింపడానికి కేంద్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తోందని ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోతు హుస్సేన్ అన్నారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తో కలసి కలెక్టర్ కార్యాలయంలో శనివారం ఆయన జిల్లా ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జాటోతు హుస్సేన్ మాట్లాడుతూ ఎస్టీల అభివృద్ధికి ప్రభుత్వం ఉద్దేశించిన లక్ష్యాలు చేరుకునేలా అన్ని చర్యలు తీసుకోవాలని, అర్హులైన ఎస్టీలకు ఉపాధి కల్పనకు వారి ఆదాయాన్ని మెరుగుపర్చడానికి అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందించడం, సరైన శిక్షణ ద్వారా ఎస్టీల్లో నైపుణ్యాలను పెంపొందించాలని ఆదేశించారు. గ్రామ, మండల స్థాయిలోనే ఎస్టీల వినతులు, ఫిర్యాదులను పరిష్కరించాలని తెలిపారు. ఎస్టీల వసతి గృహాల్లో సౌకర్యాలను మెరుగు పరచాలని, 2014- 2019 మధ్య నిర్మించిన వసతి గృహాలకు పూర్తిస్థాయిలో బిల్లులు చెల్లించాలని, ఎస్టీలకు ఉద్దేశించిన కొన్ని సంస్థలలో గత ఐదు నెలలుగా జీతాలు చెల్లించని విషయాన్ని సీరియస్ గా పరిగణించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తల సేమియా, సికిల్ సెల్ ఎనీమియా కేసులకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. గిరిజన ప్రాంతాలలో రోడ్డు సౌకర్యం లేని గ్రామం రికార్డుల్లో ఉండకూడదని ఆ దిశగా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. 2014 2019 మధ్య విడుదల కానీ హౌసింగ్ బిల్లుల విషయంలో వెంటనే తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బ్యాక్ లాగ్ పోస్టుల భక్తి విషయంలో పారదర్శకత పాటించాలని సూచించారు. గిరిజన సంఘాలు, ఎస్టీల వ్యక్తిగత ఫిర్యాదులు, విన్నత్తులపై చర్చించి వాటి పరిష్కారానికి తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ కమిషన్‌కు సివిల్ కోర్టుకుండే అధికారాలుంటాయని మర్చిపోరాదని, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం పటిష్టంగా అమలు చేయాలని, చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఆదివాసీల హక్కుల పరిరక్షణ, పర్యావరణం, అభివృద్ధి, విద్య, వైద్య రంగాల్లో వారు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సహకారం అందించడమే ఈ సమీక్ష ముఖ్య ఉద్దేశ్యమని చెప్పారు. ఈ కమిషన్ రాష్ట్రంలో అన్ని గిరిజన ప్రాంతాల్లో పర్యటించి, సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు పని చేస్తుందన్నారు. సమీక్షకు భారత ప్రభుత్వ కార్యదర్శి పెండ్లి కళ్యాణ్ రెడ్డి, ఎస్సీఎస్టీ డైరెక్టర్ ఆర్ఎస్. మిశ్రా, రీసెర్చ్ ఆఫీసర్ ఆకాష్ త్రిపాఠి, సీనియర్ ఇన్వెస్టిగేటర్ అశోక్ కుమార్ లక్కర్సు, జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తదితరులు హాజరయ్యారు. తొలుత ఎస్టి కమిషన్ జిల్లాలోని మెళియాపుట్టి, జలుమూరు మండలాల్లో ఎస్టీల సమస్యలకు సంబంధించి ప్రతినిధులతో సమావేశమై వాటి పరిష్కారానికి సంబంధిత శాఖ అధికారులకు పలు సూచనలు జారీచేసారు.

ప్లాస్టిక్ వినియోగంపై చర్యలు తప్పవు

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : నిషేదిత ప్లాస్టిక్ క్యారీ బ్యాగులను దుఖాణదారులు వినియోగించరాదని మున్సిపల్ అధికారులు స్పష్టం చేసారు. మున్సిపల్ కమీషనర్ ఎన్. రమేష్ ఆదేశాలతో శానిటరీ ఇన్స్పెక్టర్ ఉపేంద్ర పొరిడా పర్యవేక్షణలో గురువారం తనిఖీలు నిర్వహించారు. సింగల్ యూస్ ప్లాస్టిక్ పదార్థాల నిషేధంపై మార్కెట్, మెయిన్ రోడ్డులోని కిరాణా షాపులు, పాన్ షాపులు, తోపుడు బండ్లు, చాట్ -ఫాస్ట్ ఫుడ్ షాపుల నిర్వాహకులకు అవగాహన కల్పించారు. ఆయా షాపుల్లో సచివాలయ వార్డు పారిశుధ్య పర్యావరణ కార్యదర్శులతో తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీలో ముగ్గురు షాపు యజమానులకు రూ. 1000/- జరిమానా విధించి, 8.5 కేజీల ప్లాస్టిక్‌ను సీజ్ చేసారు.

కొత్తవలసలో అన్నప్రసాద వితరణ...

విశాలాంధ్ర-ఆమదాలవలస: వినాయక నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా కొత్తవలస గ్రామం బాలల కమిటీ ఆధ్వర్యంలో అంజయ్య రోడ్ లో వినాయక ఉత్సవాలను నిర్వహిస్తున్నా రు. ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు గ్రామస్తులు సహకారంతో వినాయక మండపం వద్ద శనివారం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. ప్రతి ఏట మాదిరిగానే ఏడాది కూడా అన్న ప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో 1200 మంది అన్నప్రసాద స్వీకరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. సోమవారం స్వామివారి ని నిమజ్జన కార్యక్రమం ఉంటుందని నిర్వహకులు తెలిపారు.

హనుమాన్ హెల్పింగ్ హాండ్స్ సభ్యుల ఆర్థిక సహాయం

విశాలాంధ్ర-కవిటి: మండలంలో గల డి.గోనప పుట్టుగ పంచాయతీ పరిధిలో గల వడ్డీ జల్లు పుట్టుగ గ్రామానికి చెందిన భీముడు బిసాయి కుమారుడు రోహిత్ బాబు కు కొన్ని రోజులగా కడుపులో పేగులు సంబంధించిన వ్యాధితో బాధపడుతున్నారు.వీరిది చాలా నిరుపేద కుటుంబ%శీ%.కష్టపడి పనిచేస్తే తప్ప పూట గడవని పరిస్థితి.ఇలాంటి కుటుంబనికి వ్యాధి రావడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరు విలపిస్తున్నారు.ఈ విషయం హనుమాన్ హెల్పింగ్ హాండ్స్ సంస్థ సభ్యులకు తెలిసింది.వెంటనే హనుమాన్ హెల్పింగ్ హాండ్స్ సంస్థ సభ్యులు తమ వంతుగా సహాయంగా వైద్య ఖర్చుల నిమిత్తం 7 వేల రూపాయలు ఆర్థిక సహాయంను కుటుంబ సభ్యులకు అందజేశారు.మరింత మంది దాతలు ముందుకు వచ్చి రోహిత్ బాబుకు ఆర్థిక సాయం అందజేయాలని హనుమాన్ హెల్పింగ్ హాండ్స్ సభ్యులు కోరారు.ఈ కార్యక్రమంలో హనుమాన్ హెల్పింగ్ హాండ్స్ సంస్థ సభ్యులు అనిల్, ప్రవీణ్, రంజిత్,మోహన్, రజిన్,ప్రవీణ్ పాల్గొన్నారు.

చల్లవానిపేటలో ఘనంగా వినాయక నిమజ్జనం

విశాలాంధ్ర-జలుమూరు: జలుమూరు మండలం చల్లవాని పేటలో 7 రోజులుగా ఏర్పాటు చేసిన వినాయక విగ్రహ ఉత్సవాలు శనివారం రాత్రి ఘనంగా నిమగ్న కార్యక్రమాన్ని చేపట్టారు. ఊరేగింపులో పురాతన సాంప్రదాయ ప్రకారం పోలు వేషాధరణలతో అందరును ఆకట్టుకునే విధంగా గ్రామ పురవీధుల్లో విన్యాసాలతో ఈ కార్యక్రమం చేపట్టారు అనంతరం జలుమూరు లో వంశధార ప్రధాన కాలువలో అర్ధరాత్రి సమయాన్న వందలాదిమంది భక్తుల మధ్య నిమగ్న కార్యక్రమాన్ని చేపట్టారు.

మిత్రుడుకు ఆర్థిక సహాయం

విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు : తమతో చదువుకున్న తోటి మిత్రుడు అనారోగ్యంతో బాధపడుతున్న సమాచారాన్ని తెలుసుకున్న పూర్వ విద్యార్థులు ఆయనను ఆదుకునేందుకు ముందుకు వచ్చారు. మండలం వంకులూరు ఉన్నత పాఠశాలలో 1993-94 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న లైసెట్టి ఢిల్లీ రావు కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న సహా విద్యార్థులు ఆయన చికిత్సకు శనివారం 31,700 రూపాయలు ఆర్థిక సహాయంను కుటుంబ సభ్యులకు అందజేశారు ఈ కార్యక్రమంలో లండ శేఖర్, జయ, మణి గోపాల్ పాల్గొన్నారు.